కూటమి నయవంచనపై పోరు



నిరుద్యోగ భృతి అందించాలంటూ ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ యువత విభాగం నేతలు



కలెక్టరేట్‌లోకి దూసుకెళ్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

- యువతను మోసం చేస్తున్న కూటమి పాలకులు
- ఏడాది కాలంగా రాని ఉద్యోగాలు, అందని నిరుద్యోగ భృతి
- సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా పవన్ పూర్తిగా విఫలం
- యువతపోరులో యువత, విద్యార్థుల ఆవేదన

తిరుపతి మంగళం : అధికార దాహంతో ఎన్నికల్లో నోటికి వచ్చిన అబద్ధపు హామీలు గుప్పించి అధికారంలోకి రాగానే కూటమిప్రభుత్వం యువతను వంచన, మోసంతో ద్రోహం చేసిందని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి సూచనల మేరకు సోమవారం తిరుపతిలో నిర్వహించిన యువతపోరు విజయవంతం అయింది. కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు యువత నడుం బిగించారు. అందులో భాగంగానే యువతపోరుకు తిరుపతి జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున యువత, విద్యార్థులు తరలివచ్చారని పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడంలో చంద్రబాబు, పవన్‌కల్యాన్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి పేరుతో యువతను కూడా సీఎం చంద్రబాబు మోసగించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ప్రజలు, యువతకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

యువత భవిష్యత్తు అంధకారం



వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి కంటే ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి రాగానే యువతను రోడ్డుపాలు చేశారు. నేటికీ యువతకు ఉద్యోగాలు లేక, నిరుద్యోగ భృతి రాక అంధకారంగా మారింది. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా నమ్మినవాళ్లకు వెన్నుపోటు పొడవడం తప్ప మేలు చేసినపాపాన పోలేదు. లక్షల మంది యువత ఉద్యోగాలు లేక, తల్లిదండ్రులు ఆశలు నెరవేర్చలేక, ఏమి చేయాలో దిక్కుతోచక తల్లడిల్లుతున్నారు. ఏడాది కాలంగా చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా యువతను మోసగిస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై యువత తిరగబడక ముందే ఉద్యోగాలు కల్పించాలి.

దినేష్‌రాయల్, పార్టీ యువజన విభాగం నగర అధ్యక్షులు

మోసగించడం, వంచించడమే చంద్రబాబు నైజం...



నమ్మిన వాళ్లను నట్టేటముంచి మోసగించడం, వంచించడమే చంద్రబాబు నైజం. గత ఎన్నికల్లో వందల సంక్షేమ పథకాలు అందించిన దేవుడు జగనన్నను కాదని, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ వంటి దెయ్యాలకు యువత ఓట్లు వేసి గెలిపిస్తే యువతకు ఉద్యోగాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా ఏడాదికాలంగా కాలయాపన చేస్తున్నారు. యువత ఆగ్రహాన్ని సవిచూడకముందే ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.

అనీల్‌రెడ్డి, పార్టీ సోషయల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు

ఏడాది అవుతున్నా హామీలు ఎక్కడ..?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికాలం అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎక్కడ చంద్రబాబు. అధికారం కోసం అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే హామీలను గాలికొదిలేశారు. ఏడాది అవుతున్నా ఒక్క హామీనైనా నెరవేర్చావా చంద్రబాబు ? యువతకు ఉద్యోగాలు లేక కూలిపనులు చేసుకుని జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వెంటనే యువతకు ఉద్యోగాలు కల్పించాలి, రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. లేనిపక్షంలో యువత, విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తాం.

- మల్లం రవికుమార్‌రెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు

ఏ ఒక్క హామీని అమలు చేయలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం అవుతున్నా ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఇంతవరకు ఏ ఒక్క హామీని నెరవేర్చిన పాపానపోలేదు. చంద్రబాబు అంటే మోసం, వంచన, ద్రోహం తప్ప మంచి చేయడం చేతకాదు. ప్రజలకు సూపర్‌సిక్స్, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజురీయంబర్స్‌మెంట్ అందిస్తానంటూ చంద్రబాబు హామీలు గుప్పించారే తప్ప అమలుకు నోచుకోలేదు. ఉద్యోగాలు లేక యువత, ఫీజురియంబర్స్‌మెంట్ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- చెంగల్‌రెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు

క్లుప్తంగా

వెటర్నరీ వర్సిటీ ప్రిన్సిపల్‌పై ఫిర్యాదు



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి సిటీ: వెటర్నరీ యూనివర్సిటీలో కుల వివక్షతతో అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి వర్మను కించపరిచిన ప్రిన్సిపల్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం వర్సిటీ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా కులవివక్ష చూపుతూ అధ్యాపకుడ్ని అవమానించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి హెచ్ లోకేష్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలలో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

తిరుపతి సిటీ: స్థానిక బాలాజీ కాలనీలోని ఎస్వీ సీసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచారని ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. బీకాం కంప్యూటర్స్, బీసీఏ (ఏఐ) కోర్సులలో పవన్‌కుమార్, దివ్య, హేమలత, జోష్ణబాయి, షేక్ అల్తాఫ్ విద్యార్థులు 80శాతం నుంచి 90 శాతం మార్కులు సాధించారని చెప్పారు. కళాశాలలో 92శాతం విద్యార్థులు ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం అభినందించారు.

విమాన ప్రమాద మృతులకు పిండ ప్రదానం



పిండప్రదాన క్రతువు నిర్వహిస్తున్న పురోహితులు

తిరుపతి కల్చరల్: ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి పేరిట కపిలతీర్థం అర్చక, పురోహితుల సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం కపిలతీర్థం ఆవరణలో శాస్త్రోక్తంగా పిండ ప్రదానం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవ మంత్రోచ్ఛరణలతో పిండ ప్రదాన క్రతువు నిర్వహించారు. అలాగే మృతుల ఆత్మలకు నివాళిగా 250 మందిపైగా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కపిలేశ్వర అర్చక పురోహితుల సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి శర్మ, బ్రాహ్మణ సేవా సంఘాల మిత్ర బృందం పాల్గొన్నారు.

మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

తిరుపతి రూరల్: గ్రామ పంచాయతీల్లో పరిపాలన సాగిస్తున్న మహిళా సర్పంచ్‌లకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ తరగతులను ప్రారంభం చేశారు. తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాలకు చెందిన 39మంది మహిళా సర్పంచ్‌లు ఈ శిక్షణలో పాల్గొననున్నారు.

వైఎస్సార్‌సీపీ నిరసన రేపు

పాకాల : చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ తరఫున స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో సమావేశమయ్యారు.

ఘనంగా బలిదాన్ దివస్



నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుపతి గాంధీ రోడ్డు: జనసంఘ్ వ్యవస్థాపకులు భారతీయ జనతా పార్టీ మూల కారకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలను తిరుపతిలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక హెడ్‌పోస్ట్ ఆఫీస్ నందు శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా బలిదాన్ దివాస్ నిర్వహించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

చంద్రగిరి: బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యం యాదవ్ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ 73వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నూతన కమిటీ ఎన్నిక

తిరుపతి కల్చరల్: భవన నిర్మాణ కార్మిక సంఘం తిరుపతి నగర నూతన కమిటీని ఎంపిక చేసినట్లు సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఎస్.మాధవ్ తెలిపారు. భవన కార్మిక సంఘం నగర మహాసభ అనంతరం నూతన కమిటీని నియమించినట్లు చెప్పారు. నగర అధ్యక్షుడిగా బి.శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా పి.చిన్న, నారాయణస్వామి, చిన్న వెంకటయ్య, కార్యదర్శిగా దాసు, సహాయ కార్యదర్శులుగా పలువురు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మత్తుతో జీవితాలు చిత్తు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చంద్రగిరి: మత్తు పదార్థాలను అలవాటు చేసుకోవడం ద్వారా జీవితాలు నాశనం అవుతాయని ఎక్సైజ్ ఎస్ఐ సుధాకర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలను వినియోగించడం ద్వారా విద్యార్థుల జీవితాలు చిన్నతనంలో నాశనమవుతాయన్నారు. చాలామంది విద్యార్థులు యవ్వన దశలో వాటికి బానిసలుగా మారి, భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టుకుంటున్నారని తెలిపారు. గంజాయి, మాదక ద్రవాల్యను వినియోగించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. మీ పరిధిలో ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయ, సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలియేటివ్ కేర్‌పై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి శస్త్ర చికిత్స విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పాలియేటివ్ కేర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధా ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రుయాలో పాలియేటివ్ కేర్ విభాగం మొదలైందని, ఇందులో క్యాన్సర్ బాధితులు, దీర్ఘకాల సమస్యలతో ఇబ్బంది పడే రోగులకు కావలసిన చికిత్స అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏఎస్ కిరీటి, శాస్త్ర చికిత్స విభాగాధిపతి డాక్టర్ రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై దండయాత్ర



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్మికులు

తిరుపతి కల్చరల్: అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందాపు మురళి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన అంగన్‌వాడీల ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలు, మున్సిపాలిటీ, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి సమయం సరిపోలేదా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మలీల, ఎస్.వాణిశ్రీ, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ జిల్లా నేతలు పాల్గొన్నారు.

మట్టి మాఫియాపై చర్యలు తీసుకోండి



డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి అర్బన్: రామచంద్రాపురంలో మట్టిని కరిగించి మింగేసిన మట్టిమాఫియాపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కమిటీ సభ్యులు జయచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రామచంద్రాపురంలో మండలంలో కొత్త కండ్రిగ, మిట్ట కండ్రిగ, ఎల్వీపురం, గణేష్ పురం, రాయలచెరువు, గుండోడు కణం తదితర ప్రాంతాల్లో మట్టి మాఫియా కోరలు చాచిందన్నారు. కొండలను కరిగించి గుట్టలను తవ్వి ఎరమట్టి బంగారాన్ని ప్రతిరోజు లక్షల రూపాయలకు అమ్ముతున్నారని, కానీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం రామచంద్రాపురం ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా వందలాది వాహనాలు వెళ్తున్న తహసీల్దార్ పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని మండిపడ్డారు. మట్టి మాఫియాపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మానవ విలువలతోనే ఉత్తమ సమాజం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో మానవ విలువలు అనే అంశంపై 8 రోజుల పాటు జరగనున్న ముఖాముఖి సదస్సును సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏఐసీటీఈ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ రాజీవ్‌కుమార్, యూహెచ్‌వీ సెల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నీతు భగత్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మానవ విలువలను గుర్తించి ఆచరించిననాడే ఉత్తమ సమాజం ఏర్పడుతుందని, అందుకోసం ప్రతి వ్యక్తిపై విలువలను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సుజన్‌కుమార్, డాక్టర్ వంశీకృష్ణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, దేశంలోని పలు కళాశాలల నుంచి విచ్చేసిన అధ్యాపకులు పాల్గొన్నారు.

బెదిరింపులు సరికాదు



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

తిరుపతి తుడా: స్విమ్స్ యాజమాన్యం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరు దారుణమని, బెదిరింపులు మానుకుని వెంటనే సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్విమ్స్ కార్మికుల సమ్మెలో భాగంగా పద్మావతి హాస్పిటల్ మాస్టర్ పాయింట్ దగ్గర నుంచి క్యాజువాలిటీ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ 24వ తేదీ వరకు గడువు ఇవ్వడం జరిగిందని, అంతలోపు కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, స్విమ్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసన

రుయా ఆస్పత్రి, ఎస్వీ వైద్య కళాశాలలో పనిచేస్తున్న వారికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని రుయా ఆరో వార్డు వద్ద సోమవారం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వారం రోజులుగా వేతనాల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సమ్మెబాట పడతామని హెచ్చరించారు. ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌ను విధుల నుంచి తొలగించండి



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డెయిరీ టెక్నాలజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను కులవివక్షతో దారుణంగా అవమానించిన ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డిని తక్షణం విధుల నుంచి తొలగించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేసి, ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డిని నిలదీశారు. అనంతరం వారు మాట్లాడుతూ దళిత ప్రొఫెసర్ రవివర్మను అవమానించిన ప్రిన్సిపల్‌పై వర్సిటీ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం రిజిస్ట్రార్, వర్సిటీ అధికారులతో చర్చించి ప్రిన్సిపల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, వర్సిటీ ఎస్సీ, ఎస్టీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌కు పరామర్శ

ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో తీవ్ర అవమానానికి గురైన ప్రొఫెసర్ రవివర్మను ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్ట్ నెట్‌వర్క్ తిరుపతి జిల్లా నాయకులు కిరణ్‌కుమార్, హరిప్రకాష్ సోమవారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళిత అధ్యాపకున్ని అవమానించి ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కాపాడు స్వామీ

- కూటమి ప్రభుత్వ కుట్రలు భగ్నం కావాలి
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఇరికించడం దుర్మార్గం
- కల్యాణ వెంకన్నకు చెవిరెడ్డి శ్రేయోభిలాషుల వేడుకోలు



శ్రీ కల్యాణ వెంకన్న ఆలయం ముందు కొబ్బరికాయలు కొడుతున్న చెవిరెడ్డి కుటుంబ అభిమానులు

తిరుపతి రూరల్ : కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసుల నుంచి చెవిరెడ్డిని, ఆయన కుటుంబాన్ని కాపాడు స్వామీ అంటూ తిరుపతి మండలం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతలు తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామిని వేడుకున్నారు. సోమవారం ఆలయం ముందు కొబ్బరి కాయలు కొట్టి తమ విన్నపాన్ని కల్యాణ వెంకన్నకు నివేదించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైఎస్సార్‌సీపీ యువజ విభాగం కార్యదర్శి శశిధర్ రెడ్డి, తిరుపతి రూరల్ మండలం యువజన విభాగం అధ్యక్షుడు సాయిరాయల్ మాట్లాడుతూ చెవిరెడ్డిని అక్రమంగా కేసుల్లో ఇరికించి జైలు పాలు చేయడం అప్రజాస్వామికమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజక వర్గం చంద్రగిరిలో పాతికేళ్ల తరువాత టీడీపీ గెలిచినా చెవిరెడ్డి కుటుంబానికి ఆదరణ తగ్గకపోవడంతో వారిని ఎలాగైనా ప్రజలకు దూరం చేయాలన్న కుట్రలతో ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కూడా అక్రమ కేసులో ఇరికించడం దుర్మార్గమని, చెవిరెడ్డి కుటుంబంపై పగ పట్టిన కూటమి ప్రభుత్వం కూలిపోక తప్పదని హెచ్చరించారు. అలాగే తుమ్మలగుంట గ్రామానికి చెందిన పలువురు మహిళలు కూడా కల్యాణ వెంకన్న ఆలయం ముందు పూజలు చేసి రాజకీయ కక్షల నుంచి చెవిరెడ్డి కుటుంబంను కాపాడాలని వేడుకున్నారు.

అధికారం వేధించడానికా..?



ప్రజలు మీకు అధికారం ఇచ్చింది చేతనైతే పది మంచి పనులు చేస్తారని, అంతేగానీ ప్రత్యర్థులను వేధించడానికి కాదు. చెవిరెడ్డి కుటుంబంపై పగబట్టినట్టున్నారు. చెవిరెడ్డి పేరు చంద్రగిరి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. మీరు ఎన్నికేసులు పెట్టినా ఎంత వేధించినా భయపడేది లేదు.

- లత, తుమ్మలగుంట నివాసి

దేవుడు కూడా క్షమించడు..



శ్రీవేంకటేశ్వరస్వామి వారికి పరమ భక్తుడు చెవిరెడ్డి. ఆయనపైనా, ఆయన కుమారుడిపైనా అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. కూటమి నేతలను ఆ దేవుడు క్షమించడు. పేద ప్రజలకు మంచి చేస్తామని చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంపై దృష్టి పెట్టండి.

- అమరావతి, తుమ్మలగుంట నివాసి

పాతికేళ్ల కుర్రాడిపై అంత కక్షా..?



కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షలతో రాక్షస పాలన సాగిస్తోంది. రాజకీయ కక్షలతో పాతికేళ్ల వయస్సున్న కుర్రాడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని కూడా వదలడం లేదు. లిక్కర్ కేసులో మోహిత్‌రెడ్డి పేరును కలపడం, నోటీసులు జారీ చేయడం దురదృష్టకరం. చంద్రగిరి నుంచి చెవిరెడ్డి కుటుంబాన్ని దూరం చేయాలనే దుర్బుద్ధితో అలా చేస్తున్నారు.

- తుంటి సుధాయాదవ్, వైఎస్ఆర్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గం

బలహీన వర్గాలకు అండగా చెవిరెడ్డి



చంద్రగిరి నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలబడిన చెవిరెడ్డిని అక్రమ కేసులో అరెస్టు చేసి జైలుకు పంపడం దుర్మార్గం. చెవిరెడ్డి కొడుకు మోహిత్‌రెడ్డిని కూడా ఆ కేసులో ఇరికించడం అనైతికం. రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తున్న ఈ ప్రభుత్వానికి పతనం ఆరంభమైంది.

- మల్లారపు వాసు, జిల్లా వైఎస్సార్‌సీపీ నేత, సి.మల్లవరం

నోటీస్ బోర్డు

- శ్రీవారి ప్రత్యేక దర్శనం కోటా టికెట్లు ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల
- అంజుమన్ ఉర్దూ తరఖి సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు ఉర్దూభాష కోర్సుపై చిన్నబజారు వీధిలోని ఏటీఎస్ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు.
- తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధమైన శ్రీబాలకృష్ణస్వామి వారి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు శ్రీకృష్ణస్వామి తిరుచ్చి ఉత్సవం
- తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీనివాసం, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న విష్ణు నివాసం, అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్‌లో తిరుమలకు శ్రీవారి మెట్లు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్లు పంపిణీ

ఉషశ్రీకి డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ చరిత్ర విభాగపు పరిశోధక విద్యార్థిని ఉషశ్రీకి వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆమె ప్రొఫెసర్ జి.విజయ్‌కుమారెడ్డి పర్యవేక్షణలో 'సెలెక్ట్ హిస్టారికల్ అండ్ టూరిస్ట్ సెంటర్స్ ఇన్ అండ్ అరౌండ్ తిరుపతి' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం ఈమె చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హిస్టరీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగం పరిశోధక విద్యార్థిని ఎలిజబెత్‌కు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు డిగ్రీ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమేష్‌కుమార్ తెలిపారు. సోమవారం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో బీఎస్సీ కెమిస్ట్రీ విద్యార్థిని టి.అంజన ఆర్గానిక్ కెమిస్ట్రీలో 99 మార్కులు, ఫిజికల్ కెమిస్ట్రీలో 94 మార్కులు సాధించింది. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఎస్.జాస్మిన్ అడ్వాన్స్ అకౌంటింగ్‌లో 100 మార్కులు, జి.అశ్విని 97 మార్కులు, అనుశ్రీ 95 మార్కులు సాధించారు. ఇన్‌కమ్ ట్యాక్స్‌లో అనుశ్రీ 95 మార్కులు, అశ్విని 94 మార్కులు, విజయ 92 మార్కులు సాధించారు. యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులను ప్రిన్సిపల్ అభినందించారు.

ఫిర్యాదుల స్వీకరణ

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 38 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఫోన్‌లో 11 మంది, 27 మంది నేరుగా వచ్చి వినతులు ఇచ్చారు.

డ్రైనేజీలు లేక ఇక్కట్లు

పాకాల : సుమారు 200 గృహాలు ఉన్న తమ గ్రామం తలారిపల్లిలో డ్రైనేజీలు నిర్మించి ప్రజల ఆరోగ్యాల కాపాడాలని బీఎస్పీ నేత జయదేవ్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ రవిచంద్రకు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు మొత్తం రోడ్లపైకి వస్తోందని, ప్రజలు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు వీధుల్లో తిరగలేకపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని సినిమా డైరెక్టర్ శేఖర్ కమ్ముల, నటుడు విక్రం ప్రభు, ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.